
సాక్షి ఒడిశా

ఆదివారం। 21। మే। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,52,939
బంగారం	2 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
వెండి	10 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఏమార్చేందుకు ఎత్తుగడలు

- IIలో



బస్తీ తొలగింపునకు అధికారుల సన్నాహాలు

- IIలో

న్యూస్‌రీల్

ఏఎస్‌వో మెరిట్ జాబితా రద్దు



ఓపీఎస్‌సీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపుతున్న ఏఎస్‌ఓ అభ్యర్థులు

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్‌సీ) ఆధ్వర్యంలో జరిగిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల (ఏఎస్‌ఓ) నియామకం పరీక్ష ఫలితాల మెరిట్ జాబితాను హైకోర్టు శుక్రవారం రద్దు చేసింది. మెరిట్ జాబితాలో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపణల నేపథ్యంలో, నిబంధనల మేరకు అభ్యర్థుల రాత పరీక్ష ఫలితాల తాజా మెరిట్ జాబితాను 2 నెలల్లోగా జారీ చేయాలని ఆదేశించింది. ఓపీఎస్‌సీ ప్రచురించిన మెరిట్ జాబితా ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. దీంతో ఓపీఎస్‌సీ మెరిట్ లిస్టులో పేర్లు ఉన్న అభ్యర్థులు తమకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 ఆగస్టు 27న ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ 796 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించింది. 2022 నవంబర్ 7న ఫలితాలు వెల్లడించింది. మెరిట్ జాబితా రూపకల్పనలో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిందనే ఆరోపణలతో కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు.

సిద్ధ రామయ్య ప్రమాణ స్వీకారానికి ఎంపీ ఉల్కా



కర్ణాటక కొత్త మంత్రులతో ఎంపీ సప్తగిరి ఉల్కా

కొరాపుట్: కర్ణాటక కంఠీరవ స్టేడియంలో శనివారం జరిగిన ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య ప్రమాణ స్వీకారానికి కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా హాజరయ్యారు. అక్కడ ఎన్నికల ప్రచారంలో పలుమార్లు ఉల్కా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సిద్ధ రామయ్య, డికే శివ కుమార్‌లతో సాన్నిహిత్యం ఏర్పడింది. దీంతో ప్రమాణ స్వీకారానికి హాజరవ్వాలని వారిద్దరూ ఉల్కాని ఆహ్వానించారు. ఉల్కా ప్రస్తుతం ఒడిశా రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున ఒక్కరే ఎంపీగా కొనసాగుతున్నారు. ఛత్తీష్‌ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజకీయాలను మలుపు తిప్పే పరిణామాలు ప్రారంభమయ్యాయన్నారు.

కాళీ మందిరంలో చోరీ



దుండగులు విరగ్గొట్టిన హుండీ

రాయగడ: స్థానిక సమితి కార్యాలయానికి సమీపంలో ఉన్న కాళీ మందిరంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. మందిరం ప్రాంగణంలో హుండీని దుండగులు విరగ్గొట్టి, దానిలోని సుమారు రూ.60 వేలను దొంగలించారు. ఎప్పటిలాగే శనివారం ఉదయం మందిరాన్ని తెరిచేందుకు వెళ్లిన పూజారి, మందిరం ప్రధాన తలుపులు తెరిచి ఉండడం గమనించి వెంటనే మందిరం కమిటీ సభ్యులకు తెలియజేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కొద్దిరోజుల క్రితం స్థానిక గౌతం నగర్‌లోని శివ మందిరంలోనూ ఇదే తరహా చోరీ జరిగింది. దుండగులు మందిరాలను లక్ష్యంగా చేసుకొని, వరుస దొంగతనాలకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అవసరమైతే సీట్ల పెంపు

● మంత్రి ప్రమీలా మల్లిక్



ప్రమీలా మల్లిక్

భువనేశ్వర్: అవసరమైన చోట్ల +2 శ్రేణుల్లో సీట్లు పెంచుతామని రాష్ట్ర పాఠశాలలు - సామూహిక విద్యా శాఖ మంత్రి ప్రమీలా మల్లిక్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతి జిల్లాలో అవసరాన్ని బట్టి సీట్లు పెంచుతామన్నారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ మేరకు సీట్ల సంఖ్య పెంపుదలపై శాఖాపరమైన సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నారు. సమావేశంలో సీట్ల పెంపు అనుబంధ మార్గదర్శకాలు ఖరారవుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా +2 శ్రేణి కళాశాలల్లో సమగ్రంగా 5 లక్షల 9 వేల సీట్లు ఉండగా, ఈ ఏడాది 5 లక్షల 12 వేల మంది పిల్లలు మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు.

ఈదురుగాలుల విధ్వంసం



బరంపురం: మృతి చెందిన పశువులు



బరంపురం: భమ్మునిఘాంలో...



బరంపురం: తప్పపాణి ఘాటిపై నేలకొరిగిన భారీవృక్షం



రాయగడ: లారీపై పడిన చెట్టు



రాయగడ: మృతి చెందిన పశువులు

రాయగడ: పట్టణం సమీపంలోని కదాంబరిగుడ, హలువ, కొత్తపేట, కొమట్లపేట, కల్యాణ సింగుపూర్, కాసీపూర్, బిసంకటక్ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులు విధ్వంసం సృష్టించాయి. దీంతో చెట్లు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. అదేవిధంగా ఒక లారీపై పెద్ద చెట్టు విరగిపడడంతో లారీ అద్దాలు, క్యాబిన్ విరిగిపోయాయి. అయితే ఆ సమయంలో లారీలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే రామనగుడ సమితి గులుండి పంచాయతీలోని బొడొమునిగ గ్రామంలో శుక్రవారం పిడుగుపడి 23 పశువులు మృతి చెందాయి.

బరంపురం: ప్రకృతి ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన కొందమాల్ జిల్లాలో ఒక్కసారిగా ప్రకృతి కన్నెర్ర జేసింది. గురు, శుక్రవారం రెండు రోజులు ఈదురుగాలులు విలయం సృష్టించాయి. ఫుల్బాణి, బమ్మునిగాం, దరింగబడి, రైకియా, గంజాం జిల్లా సన్నోఖెముండి బ్లాక్ పరిధి తప్పపాణి ఘాటి, కళింగా ఘాటిపై భారీ వృక్షాలు రహదారులకు అడ్డంగా నేలకొరిగాయి. ఫలితంగా 59వ నంబర్ జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొందమాల్ జిల్లా చొక్కపద బ్లాక్‌లో బమ్మునిగాం పంచాయతీ, సుబలియి గ్రామంలో ఆవులు మేపుతుండగా పిడుగు పడటంతో నాలుగు ఆవులు మృత్యువాత చెందాయి.

5 తీరాలకు బ్లూ-ఫ్లాగ్ గుర్తింపు



బ్లూ-ఫ్లాగ్ గుర్తింపు పొందిన సూనపూర్ సముద్ర తీరం



మాట్లాడుతున్న కలెక్టర్ దివ్య జ్యోతి



సూన్‌పూర్ తీరాన్ని పరిశీలిస్తున్న జ్యూరీ బృందం

బరంపురం: ఒడిశా రాష్ట్రంలోని ఐదు సముద్ర తీరాలకు బ్లూ-ఫ్లాగ్ గుర్తింపు లభించిందని గంజాం జిల్లా కలెక్టర్ దివ్య జ్యోతి పరిడా తెలియజేశారు. ఈ మేరకు గంజాం జిల్లాలోని సూన్‌పూర్ సముద్ర తీరాన్ని కేంద్ర జ్యూరీ బృందం శనివారం సందర్శించింది. అనంతరం జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లో ఉన్న కలెక్టర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పూరి జిల్లాకు చెందిన నీలాద్రీ, ముహన్, జహానియా, గంజాం జిల్లాలో హరిపూర్, సూన్‌పూర్ సముద్ర తీరాలకు బ్లూ-ఫ్లాగ్ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఒడిశా పర్యాటక అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ తీరాలను అంతర్జాతీయ పర్యాటక తీరాలుగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.

డ్రోన్‌లతో సమర్థవంతమైన నిఘా



డ్రోన్ వినియోగం సమీక్షిస్తున్న డీసీపీ ప్రతీక్ సింఘ్




డ్రోన్ ప్రయోగాత్మక పరిశీలన

భువనేశ్వర్: నగరవ్యాప్తంగా డ్రోన్‌లతో సమర్థవంతమైన నిఘా సాధ్యమని నగర డీసీపీ ప్రతీక్ సింగ్ తెలియజేశారు. కమిషనరేట్ పోలీసులు ప్రయోగించనున్న అధునాతన డ్రోన్‌ను శనివారం పరిశీలించారు. 5 కిలోమీటర్ల పరిధిలో 500 మీటర్ల ఎత్తు నుంచి కార్యకలాపాలను ట్రాక్ చేయగలదని వివరించారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా నగరంలో నేర కార్యకలాపాలను తనిఖీ చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలియజేశారు. శాంతిభద్రతలు, నిఘా, రద్దీ నియంత్రణ పటిష్టం చేసేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రయోగించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణ..?

భువనేశ్వర్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణ సోమవారం జరగనున్నట్లు తెలుస్తోంది. స్వస్థలం హర్యానా పర్యటనలో ఉన్న గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ ఆదివారం భువనేశ్వర్‌కు తిరిగి రానున్నారు. దీంతో 22న కొత్త మంత్రులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా ముగ్గురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. వీరిలో ఇటీవల ఝార్సుగుడ నియోజకవర్గం నుంచి సమీప ప్రత్యర్థిపై భారీ ఆధిక్యతతో గెలుపొందిన దివంగత మంత్రి కుమార్తె దీపాలి దాస్‌కు మంత్రి బెర్తు లభించే అవకాశాలపై చర్చ జరుగుతోంది. కొనసాగుతున్న మంత్రి మండలిలో ఇటీవల ఇద్దరు మంత్రులతో పాటు స్పీకర్ విక్రమ కేశరి అరూఖ్ రాజీనామా చేశారు. మిగిలిన ఇద్దరిలో మంత్రులు సమీర్ రంజన్ దాస్, శ్రీకాంత్ సాహు ఉన్నారు. స్పీకర్ పదవికి రాజీనామా చేసిన విక్రమ్ కేశరి అరుఖ్‌కు కొత్త మంత్రి మండలిలో స్థానం లభిస్తుందని ఊహాగానాలు బలంగా వ్యాపించి ఉన్నాయి. మరో కొత్త ముఖం ఎవరనేది ఉత్కంఠభరితంగా కొనసాగుతుంది. ఈ ఖాళీల భర్తీతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కొంతమంది మంత్రుల శాఖలను మార్చే యోచనలో ఉన్నట్లు సమాచారం.

చేతబడి అనుమానంతో హత్య



కిశోర్ చంద్ర నాయక్ మృతదేహం

బరంపురం: ప్రపంచం సాంకేతికతతో పరుగులు పెడుతున్నా ఇంకా మూఢనమ్మకాలు మనిషిని వీడడం లేదు. చేతబడి పేరుతో ప్రజా కోర్టులో దండన విధించి, గ్రామస్తులే వ్యక్తిని కొట్టి హత్య చేసిన ఘటన గంజాం జిల్లాలో చోటుచేసుకుంది. ఐఐసీ అధికారి జితేంద్ర కుమార్ మల్లిక్ తెలిపిన వివరాల మేరకు.. గంజాం జిల్లా పురుసోత్తంపూర్ గ్రామంలో చేతబడి (సిల్లంగి) చేస్తున్నాడని ఆరోపణపై కిశోర్ చంద్ర నాయక్‌ని విద్యుత్ స్తంభానికి కట్టి ప్రజా కోర్టులో దండించారు. దీంతో ఆయన చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఛత్రపూర్ ఆస్పత్రికి తరలించి, గ్రామస్తులపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రానికి రైల్వే లైన్ ప్రాజెక్టులు మంజూరు



భువనేశ్వర్: రాష్ట్రానికి రెండు కొత్త ప్రత్యేక రైల్వే ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో రెండు కొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైన్లు ఉన్నాయి. ఈ మేరకు రైల్వే శాఖ (ఈస్ట్ కోస్ట్ రైల్వే - నిర్మాణం) ది గెజిట్ ఆఫ్ ఇండియాలో నోటిఫికేషన్ శనివారం జారీ చేసింది. తాల్చేర్ వద్ద వై కనెక్షన్‌తో తాల్చేర్ మరియు అంగుల్ మధ్య కొత్త బ్రాడ్ గేజ్ రైలుమార్గం, బర్‌గడ్ రోడ్ - నువాపడా రోడ్ వరకు కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ప్రత్యేక ప్రాజెక్టులుగా పేర్కొన్నారు. తాల్చేర్ మరియు అంగుల్ మధ్య 16.50 కిలోమీటర్ల పొడవైన కొత్త రైల్వే లైను, బర్‌గడ్ నుంచి నువాపడా రోడ్ వరకు 142 కిలో మీటర్ల పొడవైన రైలు మార్గం నిర్మాణం ప్రాజెక్టులు మంజూరు కావడం విశేషం. ఈ రెండు ప్రాజెక్టులు తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలో ఉన్నాయి.

బీజేడీ ముక్త్ రాష్ట్రమే లక్ష్యం



మాట్లాడుతున్న లేఖశ్రీ సామంత సింగార్

● బీజేపీ తీర్మానం



రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

భువనేశ్వర్: రానున్న ఎన్నికల్లో బీజేడీ ముక్త్ రాష్ట్రమే లక్ష్యమని బీజేపీ నాయకులు అన్నారు. స్థానిక రాష్ట్ర శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. 2000 సంవత్సరం నుంచి రాష్ట్రంలో సుస్థిరంగా అధికారంలో కొనసాగుతున్న బిజూ జనతాదళ్ (బీజేడీ) పార్టీ దుష్పరిపాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు రాజకీయ, సామాజిక అంశాలపై చర్చించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి పురందరేశ్వరి, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, బిశ్వేశ్వర్ టుడు ఈ సమావేశానికి ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేఖశ్రీ సామంత్ సింగార్ మాట్లాడుతూ.. నవీన్ పట్నాయక్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం వస్తేనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని పేర్కొన్నారు.

సీఎం నవీన్ పట్నాయక్ ఆస్తులు వృద్ధి

● అత్యల్ప ఆస్తిపరుడిగా మంత్రి ప్రఫుల్ల మల్లిక్

భువనేశ్వర్:

రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఆయన మంత్రి మండలి సభ్యుల ఆస్తుల వివరాలను శనివారం వెల్లడించారు. ఈ వివరాల ప్రకారం ముఖ్యమంత్రి నవీన్ అందరి కంటే అధిక ధనవంతుడిగా స్పష్టమవుతోంది. 2022 సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపాస్తుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ వివరాల ప్రకారం ముఖ్యమంత్రి నవీన్ ఆస్తులు స్వల్పంగా వృద్ధి చెందగా, రుణ భారం లేకపోవడం విశేషం. మంత్రి మండలిలో అత్యంత అల్పాస్తిపరుడిగా గనులు - ఉక్కు శాఖ మంత్రి ప్రఫుల్ల మల్లిక్ ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కూడ ఆయన అందరి కంటే తక్కువ ఆస్తిపరుడుగా నిలిచారు. నవీన్ మంత్రి మండలిలో పలువురు కోటీశ్వరులు ఉన్నారు.

అధికారిక లెక్కల ప్రకారం

2022లో ముఖ్యమంత్రి ఆస్తుల వృద్ధి విలువ రూ.42,86,069 పెరిగినట్లు తెలుస్తోంది. గతేడాది డిసెంబర్ 31 నాటికి ఆయన ఆస్తుల విలువ రూ.65,40,79,694 కాగా, అంతకుముందు సంవత్సరం ఆస్తుల విలువ రూ.64.97 కోట్లకు పరిమితమైంది. అధికారిక పోర్టల్‌లోని ప్రకటన ప్రకారం, వివిధ బ్యాంకులు మరియు పోస్టాఫీసులలో డిపాజిట్లు మరియు వివిధ బాండ్ల పరంగా నవీన్ పొదుపు (నగదు) ఆస్తుల విలువ రూ.42,86,069లు పెరిగింది. ముఖ్యమంత్రి చరాస్తుల విలువ రూ.12.52 కోట్లు. వీటిలో న్యూఢిల్లీ, భువనేశ్వర్, హింజిలికట్, బర్‌గడ్ బ్యాంకు ఖాతాల్లో నగదు, నగలు, నాలుగు చక్రాల వాహనం ఇమిడి ఉన్నాయి. బంగారు ఆభరణాల విలువ రూ. 3.49 లక్షలు కాగా, 1980 మోడల్‌కు చెందిన పాత అంబాసిడర్ కారు విలువ రూ.6,434గా పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి న్యూఢిల్లీలోని జన్‌పథ్ శాఖ బ్యాంకులో రూ.70.11 లక్షలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భువనేశ్వర్ శాఖలో రూ.20.87 లక్షలు డిపాజిట్లు ఉన్నాయి. అలాగే రూ.52.88 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. ఇవన్నీ అతని తల్లిదండ్రులు బిజు పట్నాయక్ మరియు జ్ఞాన్ పట్నాయక్ నుంచి సంక్రమించినవిగా పేర్కొన్నారు. ఈ స్థిరాస్తుల్లో భువనేశ్వర్‌లో నవీన్ నివాస్‌లో మూడింట రెండు వంతుల వాటా విలువ సుమారుగా రూ.9,52,46,190 కాగా, న్యూఢిల్లీ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రోడ్-3లో ఉన్న ఆస్తిలో 50% వాటా విలువ దాదాపు రూ.43,36,18,000గా ప్రకటించారు.

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలో జరిగే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ నెల 30 నుంచి జూన్ 4వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ మేరకు శనివారం ఫ్యాక్టరీ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన ఆలయ పాలకవర్గ మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. బ్రహ్మోత్సవాలకు అయ్యే ఖర్చు మొత్తం పాలక మండలి సభ్యులే భరించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడైన ఎమ్మెల్యే రూ.లక్షను విరాళంగా అందజేశారు. పాలక మండలి సభ్యులు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి రూ.20 వేలు, కె.వి.జి.పి.బంగార్రాజు రూ.10 వేలు, తోట మధుసూదనరావు రూ.10 వేలను విరాళంగా ఇస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో సుగర్ ఫ్యాక్టరీ ఎండీ విక్టర్‌రాజు, జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు సర్వం సిద్ధం



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అతిథ్యమివ్వనున్న కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల ఖోఖో పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా కేంద్రంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 21, 22 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహిస్తోన్న పోటీల్లో పాల్గొనేందుకు 13 జిల్లాలకు చెందిన 26 బాల, బాలికల జట్లు హాజరుకానున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే పోటీలకు కస్పా ఉన్నత పాఠశాల మైదానాన్ని సిద్ధం చేశారు. క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించనున్నారు. సోమవారం సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేయనున్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జాతీయ స్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మృతుడిది పశ్చిమబెంగాల్..

గజపతినగరం: స్థానిక రైల్వేస్టేషన్ యార్డులో ఇటీవల గుర్తించిన మృతదేహం వివరాలు తెలిశాయని, పశ్చిమబెంగాల్‌కు చెందిన సలీమ్ సర్దార్ మృతదేహంగా గుర్తించామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ వి.ఎస్.మూర్తి శనివారం తెలిపారు. శవపంచనామా అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించామన్నారు. ఎలా చనిపోయాడన్నది దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇసుక నిల్వలపై కేసు నమోదు

చీపురుపల్లిరూరల్: మండలంలోని గొల్లలములగాం రెవెన్యూ పరిధిలోని తోటలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను పోలీసులు శనివారం గుర్తించి, కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ ఇసుక నిల్వలపై తమకు ముందస్తు సమాచారం అందిందని, అక్కడికి వెళ్లి, నిర్ధారించుకున్న తర్వాతే కేసు నమోదు చేశామన్నారు. గొల్లలపాలెం గ్రామానికి చెందిన పల్ల రవి, సంతాన దుర్గాప్రసాద్ ఈ ఇసుకను నిల్వ చేసినట్లు తెలిసిందన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: కొమరాడ మండలంలోని గుణానపురానికి చెందిన ఆకుల శ్రీనివాసరావు శనివారం ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. చింతపండు కొనుగోలు విషయంలో భార్యతో జరిగిన గొడవ కారణంగా అతడు ఫినాయిల్ తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి అతడిని తరలించారు.

తేలునాయుడువలసలో మరొకరు..

పార్వతీపురం: మండలంలోని తేలునాయుడు వలసకు చెందిన ఆర్.దినేష్ ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఇదే మండలంలోని తాళ్లబురిడికి చెందిన యువతి, దినేష్ గత కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే యువతి తరచూ యువకుడి ఇంటికి వచ్చి, వెళ్తుండేది. ఈ క్రమంలో ఆ యువతిని యువకుడి కుటుంబీకులు ఆమెను ఆమె ఇంటికి పంపించేసేవారు. ఇదిలా ఉండగా, యువతి తండ్రి యువకుడిపై సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మనస్తాపంతో యువకుడు చీమలమందు తాగి, ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం సీతానగరం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారని పార్వతీపురం ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపారు.

ఏమార్చేందుకు ఎత్తుగడలు



భూమిలో పాతిపెట్టిన గంజాయి



కూంబింగ్ నిర్వహించిన జవానులు

జయపురం: కొరాపుట్ జిల్లాలో అధికారులను ఏమార్చేందుకు గంజాయి మాఫియా ఎత్తుగడలు వేస్తోంది. శుక్రవారం కొంతమంది కారుకి ప్రెస్‌బోర్డు తగిలించి గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన ఉదంతం తెలిసిందే. అలాగే జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలో ఒక కల్వర్ట్ కింద భూమిలో గంజాయి బస్తాలు పాతి పెట్టి ఉంచారు. కూంబింగ్ జరుపుతున్న సమయంలో కల్వర్ట్ కింద ఏదో వస్తువు ఉన్నట్లు అనుమానించిన బీఎస్‌ఎఫ్ జవానులు, మావోలు మందుపాతర పెట్టారా అన్న అనుమానంతో శోధించగా పాతిపెట్టిన గంజాయి బస్తాలు బయటపడ్డాయి. మావో ప్రభావిత విజయవాడ- రాంచీ 326వ జాతీయ కారిడార్‌లోని పాత్రోపుట్ ప్రాంతంలో ఈ గంజాయి బయటపడడంతో వారు బొయిపరిగుడ పోలీసులకు తెలియజేశారు. వెంటనే పోలీసులు వచ్చి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడికో రవాణా చేసేందుకు గంజాయి మాఫియ అక్కడ పాతిపెట్టినట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి అశ్వినీ కుమార్ పట్నాయక్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

బస్తీ తొలగింపునకు అధికారుల సన్నాహాలు



బస్తీవాసులతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు

రాయగడ: రైల్వే డివిజన్ ఏర్పాటులో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి రైల్వే శాఖ తమ స్థలాల్లో ఉన్నటువంటి బస్తీలను తొలగించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌కు సమీపంలోని కొయిలాపాడ బస్తీని తొలగించేందుకు జూన్ 10వ తేదీ వరకు గడువు ఇచ్చారు. గడువులోగా స్వచ్ఛందంగా బస్తీని ఖాళీ చేయకపోతే తామే స్వయంగా యంత్రాల సాయంతో తొలగిస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికారులు అక్కడికి చేరుకొని బస్తీ ప్రజలతో చర్చించారు. యంత్రాల సాయంతో తొలగించేందుకు సన్నాహాలు చేపట్టిన రైల్వే అధికారులను బస్తీ వాసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. కొద్ది నెలల క్రితం రైల్వే అధికారులు ఈ బస్తీని తొలగిస్తామని, ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా ప్రజలకు నోటీసులు ఇచ్చారు. అయితే బస్తీవాసులు అవేమీ పట్టించుకోకపోవడంతో హఠాత్తుగా బస్తీని తొలగించేందుకు అధికారులు శుక్రవారం వెళ్లారు. తమకు కొద్ది రోజులు గడువు ఇస్తే తామే స్వచ్ఛందంగా ఖాళీ చేస్తామని బస్తీవాసులు చెప్పడంతో, జూన్ 10లోగా ఖాళీ చేయాలని గడువు ఇచ్చారు.

పింఛన్ సమస్యలపై అధికారుల సమావేశం



సమస్యలపై చర్చిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జయపురం: వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ అందుకోవడంలో ఎదురవుతున్న సమస్యలపై బొరిగుమ్మ సమితి అధికారులు చర్చించారు. సమితి కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు శనివారం సమావేశం నిర్వహించారు. 31 గ్రామ పంచాయతీల్లోని లబ్ధిదారులైన వృద్ధులు, దివ్యాంగులు అయా పంచాయతీ కేంద్రాలకు వచ్చి పెన్షన్ డబ్బులు తీసుకోలేకపోతున్నారు. ఈ విషయం పరిగణలోనికి తీసుకొని జిల్లా అధికార యంత్రాంగం లబ్ధిదారులకు బ్యాంక్, పోస్టల్ ఖాతాల్లో డబ్బులు వేయడం జరుగుతోంది. ఈ ప్రక్రియలో కూడా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయని, అంతేకాకుండా కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కొంత మంది సభ్యులు తెలియజేశారు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు, కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు బొరిగుమ్మ బీడీవో ఆదేశం మేరకు అదనపు బీడీవో మాధురి అనక ఈ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో 31 పంచాయతీల ప్రజా ప్రతినిధులు, పంచాయతీల కార్యనిర్వాహక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

23న క్రికెట్ జట్టు ఎంపికలు

విజయనగరం: అంతర్ జిల్లాల అండర్-14 బాలుర క్రికెట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 23న నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు నగర శివారులోని విజ్జీ స్టేడియంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తెల్లనిదుస్తులు, సొంత క్రికెట్ కిట్‌తో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. క్రీడాకారులు 2009 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2010 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు విధిగా తమ జననధ్రువీకరణ పత్రంతో పాటు స్టడీ సర్టిఫికేట్ వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 96668 18126 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా ఏపీఆర్‌జేసీ

విజయనగరం ఫూల్‌బాగ్: ఏపీఆర్‌సీఏటీ (5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి సంబంధించి) పరీక్ష శనివారం జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాల్లో సజావుగా సాగింది. 1443 మందికి 1188 మంది హాజరయ్యారు. 255 మంది గైర్హాజరయ్యారు. ఏపీఆర్‌జేసీ(ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు) పరీక్షకు 3,434 మందికి 3,019 మంది హాజరకాగా, 415 మంది గైర్హాజరయ్యారు. ఏపీఆర్‌జేసీడీసీ(డిగ్రీ) పరీక్షకు సంబంధించి 121 మందికి 96 మంది హాజరయ్యారు. 25 మంది గైర్హాజరయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్యఆరోగ్య శాఖ పరిధిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఐసీలో స్టాఫ్‌నర్సు పోస్టు-1(పీహెచ్, వీహెచ్), ఎన్‌యూహెచ్‌ఎంలో స్టాఫ్‌నర్సు పోస్టులు-2(ఎస్సీ జనరల్, ఎస్టీ మహిళ), ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు-1(బీసీ మహిళ), డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు 1(ఓసీ జనరల్), లాస్ట్ గ్రేడ్ సర్వెసెస్ పోస్టు 1(ఓసీ, ఎక్స్‌సర్వీస్‌మెన్)కి ఈ నెల 27వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు, ఇతర వివరాలకు విజయనగరంఏపీ.జిఓవి.ఇన్ వైబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

అటవీ హక్కులున్న రైతులకు పంట రుణాలు



ప్రకృతి వ్యవసాయం వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అటవీ హక్కులు కలిగి ఉన్న రైతులకు డీసీసీబీ నుంచి పంట రుణాలు అందించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశానికి హాజరైన ఆయన తోటపల్లి ప్రాజెక్టు నుంచి జూన్ మొదటి వారంలో నీటిని విడుదల చేయాలని, మిగిలిన జలాశయాల నుంచి కూడా అవసరాల మేరకు నీటిని విడుదల చేయాలని తెలిపారు. నీటి విడుదలకు ముందు ఎక్కడైనా గండ్లు ఏర్పడి ఉంటే వాటిని పూడ్చాలన్నారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు యంత్ర సేవా పథకం కింద యంత్ర పరికరాలు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరావు మాట్లాడుతూ నాట్లు వేయడానికి కూలీల సమస్య ఉందని, కొన్నిచోట్ల సకాలంలో ఉడుపులు(ఉభాలు) జరగడం లేదని, దీనికోసం యంత్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు చేసినట్లు అవుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వి.తారకరామారావు మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు స్ప్రే చేయడానికి మండలానికి 3 డ్రోన్లు చొప్పున ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించా రు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కార్-23 సదస్సు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో శనివారం ఆవిష్కార్-23 సదస్సు నిర్వహించారు. రసాయన శాస్త్రంలో విద్యార్థులు నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. మానవ జీవితం నిత్యం రసాయన పదార్థాలతో ముడిపడి ఉందన్నారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎస్.కోట బాలిక

శృంగవరపుకోట: జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ బ్యాట్మింటన్ పోటీలకు ఎస్.కోట పట్టణంలో స్పార్టన్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారిణి జె.శ్రేయోదేవి ఎంపికైనట్టు కోచ్ ఎం.ప్రసాద్ తెలిపారు. ఇటీవల పొద్దుటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చి అర్హత సాధించిందన్నారు. జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు గ్వాలియర్ (మధ్యప్రదేశ్)లో జరిగే అండర్-19 జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో తలపడుతుందన్నారు. బాలికను సహాయకోచ్ ఆర్.మోహన్‌రాజ్, స్థానికులు అభినందించారు.

మృత్యుగాలి

- పెద్దగెడ్డ జలాశయంలో రెండు నాటు పడవలు బోల్తా
- ఒకరు మృతి, మరొకరు గల్లంతు
- విషాదంలో కుటుంబ సభ్యులు

ప్రతిరోజు వలే సాయంత్రం సమయాన... ఆ ఇద్దరు గిరిజన మత్స్యకారులు తమ పడవలపై పెద్దగెడ్డ జలాశయంలోకి చేపల వేటకు వెళ్లారు. ఒకరికొకరు తోడుగా ముందుకు సాగారు. జలాశయం మధ్యకు చేరుకున్నారు. చీకటి పడిన వేళ.. చేపలు వలకు చిక్కుతాయని ఆశించిన సమయంలో ఈదురుగాలులు ధాటిగా వీయడంతో ఇరువురి పడవలు బోల్తాకొట్టాయి. ఇందులో ఒకరు మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు.



బంటు జోగయ్య(ఫైల్)

పాచిపెంట: వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు తమ భూములను త్యాగంచేశారు. తెలియని వృత్తి అయిన చేపల వేటను జీవనాధారంగా మలచుకున్నారు. బతుకు సాఫీగా సాగిపోతుందనుకున్న వేళ గాలిరూపంలో మృత్యువు కాటేసింది. పెద్దగెడ్డ జలాశయంలో చేపలవేట సాగిస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాచిపెంట మండలం కేసలి పంచాయతీ మడవలస గ్రామానికి చెందిన బంటు జోగయ్య, పద్మాపురం పంచాయతీ యార్లవలసకు చెందిన పుంగారి సీతారాం వేర్వేరు పడవల్లో పెద్దగెడ్డ జలాశయంలో శుక్రవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లారు. జలాశయం మధ్యలోకి వెళ్లగానే ఈదురుగాలులు ధాటిగా వీయడంతో పడవలు బోల్తాకొటాయి. ఇద్దరూ గల్లంతయ్యారు. రాత్రి సమయం కావడంతో ప్రమాదం గురించి ఎవరికీ తెలియలేదు. వేటకు వెళ్లినవారు తిరిగిరాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు శనివారం వేకువజాముముంచే వాకబు చేశారు. తోటి మత్స్యకారులను ఆరా తీశారు. గాలి ధాటికి ఒడ్డుకు చేరుకున్నామని వారు చెప్పడంతో అనుమానంతో జలాశయం వద్దకు చేరుకున్నారు. బోట్లు బోల్తాకొట్టి ఉండడంతో గిరిజన మత్స్యకారులు, గజఈతగాళ్లు, పోలీసులు కలిసి గాలించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో బంటు జోగయ్య మృతదేహం లభ్యం కాగా, పుంగారి సీతారాం కోసం గాలిస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. కుటుంబ పెద్ద ఒకరు మృతిచెందడం, మరొకరు గల్లంతుకావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



బంటు జోగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులను పరిష్కరించాలి

- ఎస్పీ ఎం.దీపిక



పోలీస్ అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: జగనన్నకు చెబుదాం పోర్టల్‌లోని ప్రజాఫిర్యాదులను పరిశీలించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులు అందిన వెంటనే గడువులోగా వాటిని పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. ఫిర్యాదుదారులతో కూడా మాట్లాడి, పోలీస్ శాఖ చేపట్టిన చర్యలు వివరించి, ఫిర్యాదును ముగుస్తున్నట్లుగా తెలియజేయాలన్నారు. ప్రతిరోజూ జగనన్నకు చెబుదాం పోర్టల్‌లోకి వెళ్లి, ఫిర్యాదులు నోట్ చేసుకోవాలన్నారు. ఫేటల్ రోడ్ యాక్సిడెంట్ కేసుల్లో ఎప్పటికప్పుడు ప్రమాద వివరాలను ఐరాడ్ యాప్‌లో నమోదు చేయడంతో పాటు, అధికారులు సూచించిన ఈ-మెయిల్‌కు 48 గంటల్లోగా ఎఫ్ఐఆర్, ఇతర వివరాలను పంపాలని తెలిపారు. దిశా యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. దిశా మొబైల్ వాహనాలతో కళాశాలలు, పాఠశాలల వద్ద పెట్రోలింగ్ నిర్వహించి, ఈవ్ టీజింగ్ జరగకుండా చూడాలన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. కోర్టులు జారీ చేసిన నాన్ బెయిల్‌బుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గత నెలలో నమోదై, దర్యాప్తు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, న్యాయసలహాదారులు వై.పరశురాం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్.కోట సీఐ ఎస్.సింహాద్రినాయుడు, ఎస్.కోట ఎస్‌ఐ జె.తారకేశ్వరరావు, రాజాం సీఐ ఉపేంద్ర, రాజాం పట్టణ సీఐ కె.రవికుమార్, రాజాం ఎస్‌ఐ వై.రవికిరణ్, వంగర ఎస్‌ఐ ఆర్.జనార్ధనరావు, కొత్తవలస ఎస్‌ఐ బి.దేవిలను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు.

విద్యలనగరంలో కబడ్డీ కూత

- ప్రారంభమైన రాష్ట్ర స్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలు
- అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో 13 జిల్లాల నుంచి హాజరైన జట్లు
- పోటీలను ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- రాష్ట్రంలో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి



కబడ్డీ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



పోటీలకు హాజరైన బాలబాలికల జట్లు



హోరాహోరీగా విజయనగరం-అనంతపురం పురుషుల కబడ్డీ మ్యాచ్

విజయనగరం: విద్యలనగంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియం వేదికగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న అండర్-19 బాల, బాలికల అంతర్ జిల్లాల పోటీలను జెడ్పీ చైర్మన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన బాల, బాలికల జట్లు హాజరయ్యాయి. వీరినుద్దేశించి జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణక్రీడ అయిన కబడ్డీ అభివృద్ధిలో భాగంగా ప్రత్యేక అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి అకాడమీ ఏర్పాటు విషయాన్ని తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కబడ్డీ క్రీడకు పేరొందిన విజయనగరం జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులంతా మంచి ఆట తీరుతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులందరికీ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహకారంతో భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రీడారంగం అభివృద్ధితో పాటు ప్రతిభ గల క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో రాణించి తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి పేరు తేవాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జిల్లా కోఆర్డినేటర్ చంద్రావతి, సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, పార్వతీపురం-మన్యం జిల్లా చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, డీపీఈఓ కె.సురేష్‌కుమార్, రాష్ట్రస్థాయి పోటీల అబ్జర్వర్ జయరాజ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కంటుభుక్త తవిటిరాజు, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పి.చిన్నంనాయుడు, అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ, విశ్రాంత కార్యదర్శి బొమ్మన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.తవుడుబాబు, సూర్యారావు, కె.ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

విజయనగరం వేదికగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల కబడ్డీ పోటీలు మొదటి రోజు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో సింథటిక్ మ్యాట్‌పై పోటీలు నిర్వహించారు. మొదటి రోజు జరిగిన మ్యాచ్‌లలో బాలుర విభాగంలో చిత్తూరు జట్టుపై కృష్ణా జట్టు, ప.గో.జిల్లాపై గుంటూరు జట్టు, కడప జట్టుపై నెల్లూరు జట్టు, కర్నూలు జట్టుపై శ్రీకాకుళం జట్టు, అనంతపురం జట్టుపై విశాఖ జట్టు, అనంతపురం జట్టుపై అతిథ్య విజయనగరం జట్లు విజయం సాధించాయి. బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై నెల్లూరు, విశాఖ జట్టుపై చిత్తూరు, ప.గో. జట్టుపై గుంటూరు, తూ.గో. జట్టుపై విజయనగరం, విశాఖ జట్టుపై శ్రీకాకుళం జట్టు విజయం సాధించాయి. రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారంతో ముగియనుండగా.. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికచేయనున్నారు.

క్లుప్తంగా

దర్యాప్తు వేగవంతం చేయాలి: ఎస్పీ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : తీవ్రమైన నేరాల్లో సమగ్రంగా దర్యాప్తు నిర్వహించాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో జిల్లాలో నమోదైన గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ, ఆస్తి సంబంధిత నేరాల్లో రికవరీ, ముద్దాయిల అరెస్టులపై సబ్ డివిజన్, సర్కిల్ వారీ పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. హత్య కేసులు, పోక్సో, రేప్ కేసులు, మహిళలపై జరిగే ఇతర నేరాలు, ప్రాపర్టీ కేసుల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అక్రమ గంజాయి రవాణాను అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఎస్పీ సూచించారు. ప్రైవేటు వాహనాలు, రైల్వే, బస్ స్టేషన్లలో నిరంతరం వాహనాలు తనిఖీ చేసి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు పూర్తి స్థాయిలో నిర్మూలించాలన్నారు.

రూ.25లక్షలతో పైలాన్ సుందరీకరణ



లొద్దపుట్టిలోని ప్రజాసంకల్పయాత్ర విజయ స్థూపం

ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం రూరల్: ప్రజాసంకల్పయాత్ర ముగింపు సందర్భంగా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి వద్ద నిర్మించిన విజయ స్థూపాన్ని రూ.25లక్షల సొంత నిధులతో సుందరీకరణ, మరమ్మతులు చేపట్టనున్నట్లు మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు చిహ్నంగా విజయ స్థూపాన్ని అప్పట్లో నిర్మించామని పేర్కొన్నారు. ప్రస్తుతం సొంత నిధులతో మరమ్మతులు చేపట్టి పర్యాటక స్థలంగా ఆధునికీకరిస్తున్నామని తెలిపారు.

నేడు షేర్ మార్కెట్‌పై అవగాహన సదస్సు

మదనపల్లె : నాగసతీష్ వెల్త్ బిల్డర్స్ ఆధ్వర్యంలో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల అంశంపై ఆదివారం ఉదయం 10, మధ్యాహ్నం 3, సాయంత్రం 7 గంటలకు శ్రీకాకుళంలోని హోటల్ నాగావళి, సెవెన్‌రోడ్ జంక్షన్, నియర్ హెడ్ పోస్టాఫీసు, రింగ్‌రోడ్డు వద్ద ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వయిజర్ కృష్ణకై లాష్ తెలిపారు. పెట్టుబడి ఎలా పెట్టాలి, భవిష్యత్ అవసరాలకు ఎలా ఇన్వెస్ట్ చేస్తే లాభాలు పొందవచ్చు అనే అంశాలపై వివరిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9966610358 నంబరును సంప్రదించాలని సూచించారు.

బాలికను కిడ్నాప్ చేసిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదాం

లావేరు: మండలంలోని నాగంపాలెం గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేసిన కేసులో రణస్థలం మండలం వీఎస్‌పురం గ్రామానికి చెందిన నలుగురిని శనివారం అరెస్టు చేసినట్లు జీఆర్‌పురం సీఐ ఆదాం తెలిపారు. ఈ మేరకు లావేరు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. వీఎస్‌పురం గ్రామానికి చెందిన బస హేమంత్, బి.తాతారావు, బి.రామిరెడ్డి, ఎం.పవన్‌లు నాగంపాలెం గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఈ నెల 10న కిడ్నాప్ చేసి బయట ప్రాంతాలకు తీసుకువెళ్లి ఈ నెల 15న తిరిగి విడిచిపెట్టారు. అదే రోజు బాధిత బాలిక, తల్లిదండ్రులు లావేరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో నలుగురిపైనా పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం నిందితులను అరెస్టు చేశారు. సీఐతో పాటు లావేరు ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు, ఏఎస్ఐ భుజంగరావు, పీసీలు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరగనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలన్నారు. ఈ పరీక్ష లకు జనరల్, ఒకేషనల్ కలిపి 25,714 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు వివరించారు. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయని, కావాల్సిన ఏర్పాట్లన్నీ చేయాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా ప్రత్యేక చర్య లు తీసుకోవాలని సూచించారు.

నేటి నుంచే నీలమణి దుర్గమ్మ ఉత్సవాలు



శ్రీ నీలమణిదుర్గ అమ్మవారు



అమ్మవారి ఆలయం వద్ద జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణి దుర్గమ్మ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు ఉజ్జిడి యాత్ర నిర్వహించనున్నారు. ఉజ్జిడి బండిలో పులిసిన అన్నం తీసుకెళ్లి గ్రామ శివారున ఉన్న చెట్టు వద్ద దుష్టశక్తులకు దిష్టితీస్తారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రజలందరూ వెనుకకు చూడకుండా గ్రామంలోకి వస్తారు. అప్పటి నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. కోవిడ్ కారణంగా తొమ్మిదేళ్ల అనంతరం జాతర జరుగుతోంది. పట్టణమంతా ఇప్పటికీ దీపాలంకరణతో వెలిగిపోతోంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు కొత్తగా 15 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. పండుగలకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి విజ్ఞప్తి మేరకు విద్యుత్ శాఖ నుంచి రూ.93 లక్షలు నిధులు మంజూరు చేశారు. సుమారు 400 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు.

నిర్లక్ష్యాన్ని సహించం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- వైద్యాధికారుల సమీక్షలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, గ్రామస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యశాఖ పనుల్లో పురోగతి లేని 27 పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్లాం, సారవకోట, తాడివలస, బెలగాం, కొలిగాం, సింగుపురం, మాణిక్యపురం, బైదిలాపురం, మెట్టక్కివలస, చొర్లంగి పీహెచ్‌సీల్లో కుటుంబ సంక్షేమ ఆపరేషన్లను ప్రోత్సహించడం, సుఖ ప్రసవాలు చేయడం, ప్రణాళికా ప్రకారం ఇమ్యునైజేషన్ ప్రక్రియ చేపట్టడం, మాత, శిశు మరణాల తదితర పనుల్లో పురోగతి లేకపోవడంపై ప్రశ్నించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సారవకోట, తాడివలస పీహెచ్‌సీ వైద్యులకు, ఎన్.సి.డి ప్రోగ్రాం ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షిని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనూరాధ, డీసీహెచ్ఎస్ జె.భాస్కరరావు, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జంపు కృష్ణమోహన్, ఆరోగ్యశ్రీ కోర్డినేటర్ డాక్టర్ పి.ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'జాగృతి' మేలుకొలుపుతుంది



జాగృతి-యువత కోసం కార్యక్రమం టెక్కలిలో ముగింపు సందర్భంగా పాల్గొన్న యువతకు ప్రశంసా పత్రాలు, మెమెంటో, చేతి కంకణాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక, సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ బాలచంద్రారెడ్డి తదితరులు.

- టెక్కలిలో ముగిసిన 'జాగృతి-యువత కోసం' కార్యక్రమం
- కార్యక్రమాన్ని ప్రశంసించిన అధికారులు

టెక్కలి: సిక్కోలును నేర రహితంగా మార్చేందుకు యువత భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. ఎస్పీ జీఆర్ రాధిక నేతృత్వంలో ఇటీవల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 'జాగృతి-యువత కోసం' కార్యక్రమాన్ని శనివారం టెక్కలిలో ముగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో పాటు ఎస్పీ జీఆర్ రాధిక, టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాగృతి-యువత కోసం అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చూపిన యువతీ, యువకులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు, బహుమతులు, చేతి కంకణాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐ కె.చంద్రమౌళి, ఇన్‌చార్జి తహసీల్దారు బి.గిరిబాబు తో పాటు ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు తగ్గితేనే ప్రగతి

నేరాలు తగ్గితేనే ప్రగతి సాధ్యమవుతుంది. ఆ దిశగా యువతను జాగృతం చేయాలి. యువత కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం చేస్తున్న అవగాహన కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయం.

– టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్, టెక్కలి.

వ్యతిరేక ఆలోచన వద్దు

తెలిసీతెలియక నేరాలు చేస్తూ చాలా మంది ఇరుక్కుపోతున్నారు. అలాంటి వారికి అవగాహన కల్పించేందుకు జాగృతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. పోలీసు వ్యవస్థపై వ్యతిరేక భావనలు కూడా వీడాలి. జిల్లాను నేర రహితంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

– జీఆర్, రాధిక, జిల్లా ఎస్పీ.

నేరాలు తగ్గితేనే ప్రగతి

నేరాలు తగ్గితేనే ప్రగతి సాధ్యమవుతుంది. ఆ దిశగా యువతను జాగృతం చేయాలి. యువత కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం చేస్తున్న అవగాహన కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయం. – టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్, టెక్కలి.

'క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యతని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జాతీయ క్షయ నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి టీబీ ముక్త్ పంచాయత్ కార్యకమంలో ఆయన పాల్గొన్నారు. టీబీ నిర్మూలనకు పంచాయతీ స్థాయిలో చేపడుతున్న వివరాలపై ఆరాతీశారు. వ్యాధి లక్షణాల ను గుర్తించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. క్షయ నివారణ అధికా రి అనురాధ మాట్లాడుతూ టీబీ ముక్త పంచాయతీ సర్టిఫికెట్ కోసం చేపడుతున్న చర్యలు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, జి ల్లా డీసీహెచ్ఎస్ జల్లు భాస్కర రావు, జెడ్పీ సీఈఓ వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



మృతి చెందిన అప్పలరాము

సరుబుజ్జిలి: మండలంలోని బురిడివలస కాలనీకి చెందిన దిండి అప్పలరాము (53) శనివారం చెరువులో మునిగి మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అప్పలరాజు రోజూ మాదిరిగానే బహిర్భూమి కోసం యాసర్లవాని చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి మునిగిపోయాడు. చెరువు లోతుగా ఉండడం, ఈత రాకపోవడంతో మునిగి చనిపోయినట్లు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు.

నేరానికి శిక్ష తప్పదు



మాట్లాడుతున్న పీడీఎం కోర్టు జడ్జి శారదాంబ

శ్రీకాకుళం క్రైమ్ : చిన్నదైనా పెద్దదైనా ప్రతి నేరానికి శిక్ష తప్పదని శ్రీకాకుళం పీడీఎం కోర్టు న్యాయమూర్తి కె.శారదాంబ అన్నారు. శనివారం బాపూజీ కళామందిర్‌లో జాగృతి-యువత కోసం ముగింపు కార్యక్రమం శ్రీకాకుళం సీడీపీఓ డీఎస్పీ వై.శృతి ఆధ్వర్యంలో రెండు పట్టణ పోలీస్ స్టేషన్ల సిబ్బంది నిర్వహించారు. సీఐ లెంక సన్యాసినాయుడు అధ్యక్షతన ముందుగా విద్యార్థులు, యువత ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలపై మాట్లాడించారు. అనంతరం విద్యార్థినులచే సాంస్కృతిక ప్రదర్శనలు చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వై.శృతి మాట్లాడుతూ యువత ఎటువంటి కేసుల్లోనూ చిక్కుకోకుండా కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వర్రావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జగన్మోహనరావు, ఎస్ఐలు బలివాడ గణేష్, వి.సందీప్ కుమార్, కె.లక్ష్మి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌లో సిక్కోలు సత్తా

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పాలీసెట్-2023 ఫలితాలను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ శనివారం విడుదల చేసింది. జిల్లా నుంచి 11,198 మంది హాజరు కాగా, 9705 మంది ఉత్తీర్ణత సాధించారు. 86.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 6,503 మంది బాలురు పరీక్ష రాయగా, 5,534 మంది ఉత్తీర్ణత సాధించారు. 4,695 మంది బాలికలు పరీక్ష రాయగా, 4171 మంది ఉత్తీర్ణత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులు ర్యాంకు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలని, త్వరలో కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు ప్రవేశాల సమన్వయకర్త, శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజశేఖర్ చెప్పారు.

మెరిసిన విక్రమ్ రాజా



విక్రమ్ రాజా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం అల్లినగరం గ్రామానికి చెందిన బుడుమూరు విక్రమ్‌రాజా ఏపీ పాలీసెట్‌లో మెరిశాడు. విద్యార్థి 120 మార్కులకు గాను 119 వచ్చాయి. రాష్ట్రస్థాయిలో 37వ ర్యాంకు రాగా.. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. సెట్‌లో గణితంతో 50కి 49, ఫిజిక్స్‌లో 40కి 40, కెమిస్ట్రీలో 30కి 30 మార్కులు సాధించాడు. విద్యార్థి తండ్రి సోమరాజు ఉపాధ్యాయుడు కాగా, తల్లి కల్యాణి గృహిణి.

శ్రీకర్‌కు 16వ ర్యాంకు



లఖినాన శ్రీకర్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ వార్డు టీచర్స్ కాలనీకి చెందిన లఖినాన శ్రీకర్ శనివారం విడుదలైన పాలిటెక్నికల్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 16వ ర్యాంకు సాధించాడు. సీబీఎస్‌సీలో పదో తరగతి పూర్తి చేసిన శ్రీకర్ పాలిసెట్‌లో 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించాడు. తండ్రి లఖినాన వెంకటాచలం, తల్లి దుప్పల శ్రీదేవిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

స్కూటీల పంపిణీ



దివ్యాంగుడికి స్కూటీ అందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం విభిన్న ప్రతిభావంతులకు స్కూటీలు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో వచ్చిన మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలను లబ్ధిదారులకు అందజేశారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు 12 మందికి ఈ స్కూటీలను అందించారు. పూర్తిగా నడవలేని దివ్యాంగులకు 100 శాతం సబ్సిడీతో ప్రభుత్వం వాహనాలు అందజేసిందని మంత్రి తెలిపారు. పలాస నియోజకవర్గానికి సంబంధించి రూ.12 లక్షల విలువగల 10 రిట్రోఫిటెడ్ మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలు అందించారు. కార్యక్రమంలో సహాయసంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులు సంక్షేమశాఖ శ్రీకాకుళం, పీడీ కె.కవిత తదితరులు పాల్గొన్నారు.

స్కిల్‌హబ్‌తో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు జగనన్న ప్రభుత్వం స్కిల్ హబ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ప్రత్యేక శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతీ నియోజవర్గ కేంద్రంలో స్కిల్ హబ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నరసన్నపేటలో నైపుణ్యాభివృద్ధి కళాశాలను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని, దీనికి ఐదు ఎకరాల స్థలం కేటాయించినట్లు గుర్తు చేశారు. రాజకీయ స్వలాభం కోసం మాయమాటలు చేప్పే కొన్ని పార్టీల నేతలు మాటలు నమ్మిపోసపోవద్దని యువతకు హితవుపలికారు. ఎన్నికల హామీలు అన్నింటినీ అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని వదులు కోవద్దని కోరారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.బి.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 8 నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

క్లాస్ రూమ్స్, ల్యాబ్స్ ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, నాయకులు రాజాపు అప్పన్న, చీపురు కృష్ణ, కేసీహెచ్‌బీ గుప్త తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు



లారీ కింద మణికంఠ మృతదేహం

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ పరిధి బొడ్డేపల్లిపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన యువకుడు చిలకలపల్లి మణికంఠ (23) కొర్లకోటలో తన పిన్ని కుమారుడు వివాహం జరుగుతున్న సందర్భంగా ఇద్దరు మహిళలు పిడిమి రాజులమ్మ, పిడిమి మీనాలను తన బైకుపై ఎక్కించుకొని కొంత సామానులతో వస్తున్నాడు. అదే సమయంలో శ్రీకాకుళం నుంచి పాలకొండవైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో మణికంఠ లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. రాజులమ్మ, మీనాలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమడోలుకు చెందిన రాజులమ్మ తమ్ముడి వివాహం కోసం కన్నవారి గ్రామం కొర్లకోట ఇటీవల చేరుకుంది. వివాహ సామగ్రి కొనుగోలు నిమిత్తం తోటికోడలు మీనాతో కలిసి మణికంఠ బైక్‌పై తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. రాజులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో వివాహం జరుగుతున్న వేళ పెండ్లికుమారుడి పిన్ని కొడుకు మృతిచెందడం, అక్క, పిన్నికుమార్తెకు గాయాలు కావడంతో అందరూ విషాదంలో మునిగిపోయారు.

బుడితిలో విషాదఛాయలు

సారవకోట: చిలకపల్లి మణికంఠ మృతితో స్వగ్రామం బుడితిలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి పాపారావు బుడితి జంక్షన్‌లో రైస్‌మిల్లులో హమాలీగా పనిచేస్తుండగా, మణికంఠ పెయింటింగ్ పనులకు వెళ్తుండేవాడు.

కార్యదర్శులకు షోకాజ్ షాక్

- స్వామిత్వ సర్వేపై నిర్లక్ష్యం
- జిల్లాలో 156 మంది పంచాయతీ సెక్రటరీలకు నోటీసులు
- 295 పంచాయతీల్లో మందగించిన సర్వే
- కేవలం 47 పంచాయతీల్లోనే పూర్తి

అరసవల్లి: గ్రామీణ ప్రాంతాల్లో గ్రామకంఠం భూముల క్రమబద్ధీకరణ, అనుభవ యజమానులకు ఆస్తి ధ్రువీకరణల దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వేసిన అడుగుల్లో కొందరు అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం/ సర్వే ఆఫ్ విలేజెస్ అబాది (గ్రామకంఠం) అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజి ఏరియా (స్వామిత్వ) సర్వే పేరిట జిల్లాలో 2020లో ప్రారంభమైన ఈ సర్వే నత్తనడకన సాగుతోంది. వేలాది మందికి ఆర్థిక ఆస్తి ప్రయోజనాలందించే ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన క్రమంలో మూడు దశలుగా సర్వే పూర్తి చేయాల్సి ఉంది. అయితే జిల్లాలో అధిక శాతం పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడంతో ఉన్నతాధికారులు కొరడా ఝులిపించారు. ఏకంగా 156 మంది పంచాయతీ సెక్రటరీలకు జిల్లా పంచాయతీ అధికారి నుంచి షోకాజ్ నోటీసులు జారీ కావడం చర్చనీయాంశమైంది.

342 పంచాయతీల్లో అమలు..

డ్రోన్ టెక్నాలజీతో గ్రామీణ ప్రాంతాల్లో గ్రామకంఠాలను గుర్తించి వినియోగించి గ్రామీణ గ్రామకంఠం, హేబిటేషన్ గ్రామాల్లో అన్ని ఇళ్లు, ఆస్తుల సర్వే, తదనంతరం యజమానులకు యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం ద్వారా సమస్త ఆస్తి ధ్రువీకరణ పరిష్కారాన్ని అందించడమే ఈ స్వామిత్వ సర్వే పథకం లక్ష్యం. జిల్లాలో ఈ సర్వే ప్రగతి పెద్దగా కనిపించడం లేదనే చెప్పాలి. జిల్లాలో 912 గ్రామ పంచాయతీల్లో 527 పంచాయతీల్లో డ్రోన్స్ ఫ్లై జరుగగా.. మ్యాపింగ్ ఆధారంగా 342 పంచాయతీల్లో సర్వే ప్రారంభించారు. ఇందులో 176 గ్రామ పంచాయతీల్లో 63,885 గ్రామ కంఠం ఆస్తులను గుర్తించి గ్రౌండ్ ట్రూతింగ్ చేయగా, మరో 86 పంచాయతీల్లో 16636 గ్రామకంఠం ఆస్తులకు గ్రౌండ్ వాలిడేషన్ పూర్తి చేసినట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. సుమారు 295 గ్రామ పంచాయతీల్లో సర్వే మందకొడిగా సాగుతోంది. కేవలం 47 గ్రామ పంచాయతీల్లో మాత్రమే పూర్తి స్థాయిలో సర్వే పూర్తి కాగా.. 8904 గ్రామ కంఠం ఆస్తులకు ఇప్పటికే అధికారులు థర్టీన్ నోటిఫికేషన్ గెజిట్ జారీ చేశారు.

సమన్వయ లోపమే కారణం..!

చాలా పంచాయతీల్లో కార్యదర్శులతో పాటు ఇతర టీం సభ్యుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి గ్రామ పంచాయతీకి సెక్రటరీతో పాటు సచివాలయ వీఆర్వో, విలేజి సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ తదితర ఐదుగురు బృందం (జీపీ సర్వే టీం) గ్రామకంఠం భూములను, ఆస్తుల లెక్కలు తేల్చాల్సి ఉంది. అయితే అధికారిక సర్వే టీంలో సమన్వయ లోపం కారణంగా సర్వే పూర్తి చేయలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు గత ఏడాది కూడా ఇదే విషయమై గట్టిగా హెచ్చరికలు జారీ చేసినప్పటికీ పెద్దగా ప్రగతి చూపించలేదనే అభిప్రాయాలు ఉన్నతాధికారులే వ్యక్తం చేస్తున్నారు.

156 మందికి షోకాజ్ నోటీసులు..



స్వామిత్వ సర్వే ప్రాధాన్యతను ఇప్పటికే చాలా సార్లు సర్వే టీంకు తెలియజేశాం. ముఖ్యంగా కార్యదర్శులు పనితీరు మెరుగుపరుచుకోవాలి. జిల్లాలో ఈ సర్వే చాలా మందకొడిగా సాగుతున్న క్రమంలో షోకాజ్ నోటీసులను సుమారు 156 మందికి జారీ చేశాం. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో లక్ష్యాలను చేరుకునేలా చర్యలు చేపట్టాలి.

– వి.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి